


# అగ్గిపుల్ల

కొల్లూరు కోటేశ్వర రావు

పైడయ్య చుట్ట వెలిగించి. వెలుగుతున్న అగ్గిపుల్లని ఆర్పేసి: నేల మీద పడేశాడు. కిందపడిన అగ్గిపుల్ల వేపు చూడకూడదనుకుంటూనే, దానివేపు చూసేడు.

దాని కొసనుండీ పొగవస్తోంది. కష్టపడినంతకాలం కష్టపడి. తర్వాత కష్టపడాలన్నా రెక్కల్లో సత్తువలేని పైడయ్యలాగే వుందా అగ్గిపుల్ల కూడా!

అందుకే పైడయ్యకి ఆరిపోయిన అగ్గిపుల్లలంటే కోపం, అసహ్యమూ. వెలిగినంత కాలం వెలిగినా, తర్వాత అవి దేనికీ పనికి రానివనే పైడయ్య అభిప్రాయం!

కోడలు వచ్చింది.

"రెండగ్గి పుల్లలిటివ్వరా పొయ్యెలిగించాల."

"ఇంట్లో మరగ్గిపెట్టె నేదేటి?"

"నేదు. ఉంటే నిన్నడుగుతానా?" ఎదురుప్రశ్న వేసింది.

పైడయ్య మరి మాట్లాడకుండా నాలుగగ్గిపుల్లలు తీసి కోడలి చేతిలో పెట్టేడు.

పైడయ్య పెళ్ళాం ఊళ్ళోయేమేనా పని దొరుకుతుందేమోనని బయల్దేరింది. ఈ రోజేకాదు ప్రతిరోజూ వెళ్తుంది.

"బొట్టిడేడీ?" అనడిగేడు, లోపలికెళ్తున్న కోడల్నుద్దేశించి.

"బళ్ళోకెల్లినాడు."

ఆడికి బడెందుకని ప్రతీసారీ పైడయ్యనుకుంటాడు. "మన బతుకు లెలాగూ

---

**మనిషి తోటి మనిషిని**
**దోచి వేస్తుంటే నేరం**
**దేవుడిది ఎలా అవుతుంది?**

---

బానిస బతుకులైపోనాయి. ఆణ్ణైనా సదివించి ఉద్దోగం సేయిద్దాం." అంటుంది పైడయ్య పెళ్ళాం. "యెర్రిదానా? ఉద్దోగాలు మన్లాటోళ్ళకి కాదే? నానూ. మన పెద్దోడి సిన్నతనాన, ఆణ్ణి బాగా సదివించి ఆడిచేత ఉద్దోగం సేయిద్దావనుకున్నాను.. కానీ యేమైంది?.. ఆడూ కూలోడైనాడు. అవునా కాదా?" అంటాడు. "బాగుందిరా నీమాట! నీ బతుకిలాగవబట్టే ఆడు కూలోడైనాడు. నేపోతే ఆడీపాటికేదేనా ఉద్దోగం సేస్తూండేవాడు కాదా?" అంటుంది. పైడయ్య పెళ్ళాం. మరి పైడయ్య మాట్లాడ్డు.

అవును! పైడయ్య బతుకలాగవడానికి కారణం వాడికేదో రోగవో, జబ్బో కాదు. వాడీ మంచంలో పడకముందు నూరు కేజీల ఇనపగుండులా. దుక్కలా ఉండేవాడు. కర్రల దుకాణంలో సునాయాసంగా కర్రలు కొట్టి పారీసేవాడు. అసలింతకీ ఈ మంచంలో యెలా పడ్డాడంటే ఆ రోజు కూడా మామూలుగానే పెద్ద పెద్ద కర్రల్ని, చిన్న చిన్న ముక్కలుగా కొడుతున్నాడు. అయితే ఒక కర్ర తీస్తూండగా, దొంతర్లు దొంతర్లుగా పేర్చివున్న కర్రలన్నీ జారి పడ్డాయి. వాటికింద పైడయ్య కాళ్ళుండిపోయేయి. వాట్ని తొలగించే ప్రయత్నంలో చేతులకీ గట్టి దెబ్బలే తగిలేయి. ఇంతలో యజమాని వచ్చేడు. "యేరా లంజకొడకా సమంగా పన్చెయ్యలేవేంటి?" అని తిట్టుకుంటూ, కర్రల్ని

పక్కకి తొలగించేడు ఆ కర్రల కింద రక్తం కనిపించింది. మాంసం ముద్దో మరేదో కనిపించింది. కానీ కాళ్ళుమాత్రం కనిపించలేదు. పైడయ్యకూడా తన కాళ్ళ వేపు చూసుకున్నాడు చూసుకోగానే వాడు ముఖం తిరిగి పడిపోయేడు. బాధతోకాదు. యింక ముందెలా పని చెయ్యగలనన్న భయంతో!

తర్వాత యజమానే పైడయ్యని ఆస్పత్రిలో చేర్పించేడు. చాలా రోజులు పైడయ్యని ఆస్పత్రిలోనే ఉంచేరు. రోజూ వాడి పెళ్ళాం పిల్లలూవచ్చి చూసిపోతుండేవాళ్ళు. రాత్రిపూట ఆస్పత్రిలోకి "విజిటర్స్"ని రానివ్వరుకదా! అందుకని పైడయ్య పెళ్ళాం యింటి కెళ్ళిపోయేది. పిల్లల్నెలా పోషిస్తున్నాడో అని, పైడయ్య రోజూ బెడ్ మీద కూర్చుని గంటల తరబడి ఆలోచించేవాడు. కానీ ఏవో అతనికి సమాధానాల్తోనే సరిపెట్టుకోవాలని చూసేవాడు. పైడయ్య పెళ్ళాంకూడా పిల్లల్ని బాగానే పోషించింది. ఎలాగని నన్నడక్కండి. నిజం చెప్పేస్తే, తెలుగు సినిమాల్లో ఊహించిన ముగింపులాగే ఉంటుంది.

ఆఖరికి ఓ శుభ ముహూర్తాన పైడయ్యని డిస్‌చార్జ్ చేశారు. చేస్తూ "నువ్వింక హాయిగా మంచంమీదే పడుకోవచ్చు" అన్న శుభవార్తనికూడా చెవిలో వేసేరు. పైడయ్య ఏం నిశ్చేష్టుడవలేదు. ఎందుకంటే యజమాని తనని ఆస్పత్రిలో చేర్చి, మరి చూడ్డానికయినా రాకపోయినప్పుడే వాడికీ సంగతి స్పష్టంగా తెలిసిపోయింది. తిన్నగా యజమాని దగ్గర కెళ్ళి యేడ్చేడు. యజమాని కూడా సానుభూతి చూపించేడు. "కొంపదీసి నష్టపరిహారం యిమ్మ నడగడుకదా?" అని భయపడ్డాడు. కానీ "ఈ వెధవకి లా యేం తెల్సు? నాబొంద" అనుకుని స్థిమిత పడ్డాడు.

"పోనీ బాబూ! మాపెద్దోడ్నైనా పన్లోయెట్టుకోండి బాబూ! లేప్పోతే ముష్టోళ్లమై పోతాం బాబూ!" అని పేడుకున్నాడు పైడయ్య. "అదెలారా? నీ కొడుక్కింకా పట్టుమని పదహారేళ్ళైనా రాందే? వాడేం పన్చేస్తాడని?" అన్నాడతను. "ఏదో ఓ పని బాబూ! నువ్వాదారీ సూపెట్టకపోతే ముష్టెత్తుకునే బతకాల. పెద్దోడేనా సేతికందొస్తే అదేసాలు.దయ సూపించు బాబూ!" నిజంగా ముష్టోళ్ళాగే పేడుకున్నాడు. కానీ యజమాని దయ చూపించలేదు. "నావల్ల కాదు. ఫో" అన్నాడు. పైడయ్యపెళ్ళాం "మేం నీకేవపకారం సేసేవని మమ్మల్నిలా ఏడిపిస్తున్నావ్రా దేవుఁడా!" అని ఏడిచింది.

కానీ ఒక విధంగా చూస్తే దేవుఁడు వాళ్ళకి ఉపకారమే చేసేడన్చెప్పాలి. ఎందుకంటే పైడయ్య [illegible] అంతా బతికే వుంటే, నిజంగానే [illegible] వాడి అడుక్కుతినాల్సిందే. అందుకే అందరూ రోగాలొచ్చి చావగా, పెద్దకొడుకూ. ఆఖరి కొడుకూ మిగిలేరు. ఆ విధంగా దేవుడు ఉపకారం చేసేడు వాళ్ళకి.

పైడయ్య మంచంలో పడిన్తర్వాత. వాడి పెద్ద కొడుకు రోజూ ఏదో కూలి పన్చేస్తూ డబ్బులు సంపాదించేవాడు. అప్పట్నుంచే వాడు కూడా పైడయ్యే అయేడు. పేర్లో కాదు. బతుకులో....!

తెరలు తెరలుగా దగ్గొచ్చింది పైడయ్యకి. మెల్లిగా లేచి పక్కనున్న రేకు డొక్కులో ఉమ్మి. "హమ్మయ్య!" అనుకుని ఆయాసంగా మంచమ్మీదపడ్డాడు.

పక్కనేవున్న పైడయ్య చేతికర్ర పైడయ్యవేపు జాలిగా చూస్తున్నట్టుగా ఉంది.

మంచం మీద నుంచి కదిల్తే చాలు ఆయాసం ముంచుకొస్తుంది పైడయ్యకి. కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

ఇంతలో కుక్క అరుపు వినిపించింది. వెంటనే మరో కుక్క అరుపు.

ఏమిటా అని పైడయ్య కళ్ళు తెరిచి చూసేడు. తన యింటికి రెండు గజాల దూరంలో చిన్న - తన పెంపుడు కుక్క - మీద మరో కుక్క తిరగబడ్తోంది. ఆ చిన్న కూడా పైడయ్యలాగే ముసిల్దైపోయింది. పైడయ్య గొయ్యిలాటి కుక్కిమంచంలో పడుకుంటే. ఆ కుక్క గోతిలో పడుకుంటుంది. దాని ఒంటినిండా గజ్జికురుపుల్తో అసహ్యంగా కన్పిస్తుంది. అయినా పైడయ్యకి "చిన్న" అంటే అభిమానమే! అప్పుడెప్పుడో ఓ రోజు తను తినగా మిగిలిన పిడికెడు అన్నాన్ని ఆ కుక్కకి పడేసేడంతే! అప్పట్నుంచి ఈనాటి వరకూ పైడయ్యనే అంటిపెట్టుకుని ఉంది.

పైడయ్య మళ్ళీ ఆ కుక్కల వేపు చూశాడు. చిన్న గోతిలోంచి లేవకుండానే పళ్ళన్నీ బయటపెట్టి వికృతంగా అరుస్తోంది. బలిష్ఠంగా వున్న ఆ కుక్క, చిన్న మీదొక్కసారి తిరగబడింది. రెండూ అరుస్తూ. దెబ్బలాడుకున్నాయి. దుమ్ము రేగింది. 'చిన్న' ఒంటి నుంచి రక్తం కారింది. తోక ముడిచి. బాధగా అరుస్తూ పారిపోయింది 'చిన్న'.

బలిష్ఠమైన ఆ కుక్క - విజయగర్వంతో ఆ చోటుని ఆక్రమించుకుంది.

"బలహీనుల్ని. బలవంతులు దోచుకున్నట్టు మనుషుల్లోనే వుందనుకున్నాను. కానీ జంతువుల్లో కూడా వుందన్నమాట."



రామచంద్రపురంలో మే నెలలో జరిగిన రాష్ట్రస్థాయి నాటికలపోటీలలో విజయవాడ కళాంజలి ప్రదర్శించిన మనీ + షి నాటికలో ద్వితీయ ఉత్తమ నటుడు బహుమతి పొందిన శ్రీ కె. యల్. రావు

అనిపించింది పైడయ్యకి. పైడయ్య భరించలేకపోయేడు. "ఛీ! ఛీ!" అని గట్టిగా అరిచేడు. మంచమ్మీద నుంచి కొద్దిగా కదుల్తూ.

ఆ కుక్క పైడయ్య వేపొకసారిచూసి. తనని కాదన్నట్టు నిర్లక్ష్యంగా పడుకుంది. కార్మికులు చేస్తున్న సమ్మెని యజమాని "ఏడిశారు. బికారి వెధవల్లారా!" అంటే, కార్మికులెలా ఫీలవుతారో. పైడయ్య కూడా అలాగే ఫీలయేడు

"ఛీ!" లేని ఓపిక తెచ్చుకుని. మంచం మీద నుంచి లేచి. చేతికర్ర విసిరేడు.

సరిగ్గా అది కుక్కకే తగిలింది. "కుయ్యో" మని అరుస్తూ ఆ కుక్క అక్కణ్ణుంచి పారిపోయింది. పైడయ్య చేతిలో వున్న చుట్ట జారి కిందపడి. ఆరిపోయింది.

"చిన్నా! రారా!" అని యెలుగెత్తి పిలిచేడు. అది రెండు క్షణాల్లోనే తోకాడించుకుంటూ వచ్చి. పైడయ్యవేపొకసారి చూసి మళ్ళీ గోతిలో పడుకుంది. ఆ చూపు తన వేపు కృతజ్ఞతతో చూసిన చూపులా అనిపించింది పైడయ్యకి. గర్వంగా మీసం మెలివేశాడు

ఆరిపోయిన చుట్టని తీసి. మళ్ళీ అగ్గిపుల్లతో వెలిగించి, కింద పడేసేడు.

కానీ, ఈసారి ఆ అగ్గిపుల్ల వేపు కోపంగాగానీ, అసహ్యంగాగానీ చూడలేదు.

ఆ పుల్ల కూడా ఎప్పటికేనా వెలుగు కోసం చేసే ప్రయత్నాల్లో ఉపయోగపడుతుందనిపించింది పైడయ్యకి.

★